

సోమశిలలో 35.239 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 35.239 టీఎంసీలు ఉన్నాయి. 397 క్యూసక్కెల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,425 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,01,810
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,206
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,482
నవర (8 గ్రాములు)	రూ.75,856

గరిష్టం/కనిష్టం
36.0 /30.3

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా, మేఘావృతంగా ఉంటుంది. సాయంత్రం తర్వాత స్వల్ప వర్ష సూచన ఉంది. ఆదివారం గాలిలో తేమ 50 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

తల్లులకు వందనం

- సాక్షికి కృతజ్ఞతలు తెలిపిన అమ్మలు




గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

సాక్షి ఎఫెక్ట్..

సోమశిల: అనంతసాగరం మండలంలోని గౌరవరంలో అర్హులైన తల్లులకు తల్లికి వందనం జమకాకపోవడంపై 'అనర్హులకు వందనం.. అమ్మలకు ఆగ్రహం' శీర్షికన 'సాక్షి' ప్రధాన సంచికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఆదివారం గ్రామంలో ఇంటింటికి తిరిగి లబ్ధిదారుల నమోదు ప్రక్రియలో పొరపాట్లు జరిగాయని గుర్తించారు. అర్హులైన ఏడుగురు లబ్ధిదారులకు నగదును అందజేశారు. దీంతోపాటు విద్యార్థి, తల్లి వివరాలు మార్పులు ఉండడంతో స్టేట్ నుంచి వచ్చిన లిస్ట్‌లో 30 మంది లబ్ధిదారుల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో సరిదిద్దినట్లు తెలిపారు. నగదు జమ కాని వారికి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో వారి ఖాతాల్లో జమవుతుందని ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 'సాక్షి' కథనంతో తమకు న్యాయం జరిగిందని నగదు అందుకున్న తల్లులు హర్షం వ్యక్తం చేశారు.

ఆగని తెల్లరాయి తవ్వకాలు



అనుమతులు లేకుండానే తవ్విన తెల్లరాయి

కలువాయి (సైదాపురం): కలువాయి మండలం కోటూరుపల్లిలో తెల్లరాయి గనులు ఎక్కువగా ఉన్నాయి. తెల్లరాయికి విదేశాల్లో గిరాకీ ఎక్కువగా ఉండడంతో కూటమి నేతలు అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. టిప్పర్ల ద్వారా రాత్రిళ్లు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో విలువైన ఖనిజ సంపద గనులు కరిగిపోతుండడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. తెల్లరాయి అక్రమ రవాణా విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ దందా వెనుక వెంకటరెడ్డిపల్లి, కోటూరుపల్లికి చెందిన నేతలు ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో తవ్విన ఖనిజాన్ని సైదాపురం తరలిస్తారు. అక్కడి నుంచి విదేశాలకు పంపుతున్నట్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకుని సహజ వనరులను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

స్నేహితుడి కుమార్తెపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి..
- పోక్సో కేసు నమోదు

నెల్లూరు (క్రైమ్): కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ వ్యక్తి స్నేహితుడి కుమార్తెపైనే లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చడంతో ఆదివారం విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. సంతపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి తన భార్య, పదిహేడేళ్ల కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతనికి వారధి సెంటర్‌కు చెందిన కుమార్ స్నేహితుడు ఉన్నాడు. ఇరు కుటుంబాలు సన్నిహితంగా ఉంటున్నాయి. అందరూ కలిసి బయటకు వెళ్లేవారు. ఈ ఏడాది మార్చిలో ఇరు కుటుంబాలు తిరుమలకు వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో కుమార్ అతని భార్య, స్నేహితుడి కుమార్తె శ్రీకాళహస్తికి వెళ్లారు. అక్కడే ఉండి మార్చి 16న నెల్లూరుకు వచ్చారు. బాలిక కుమార్ ఇంట్లో ఉండగా, అతని భార్య వ్యాపార నిమిత్తం బయటకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన కుమార్ బాలికను బెదిరించి లైంగిక దాడి చేశాడు. ఈ విషయం ఇంట్లో చెబితే చంపేస్తామని బెదిరించాడు. దీంతో బెదిరిపోయిన ఆమె ఎవరికి చెప్పలేదు. రెండు నెలలుగా బాలికకు పీరియడ్స్ రాకపోవడంతో బాధిత తల్లి ఆమెను శనివారం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక గర్భవతి అని నిర్ధారించారు. దీంతో బాలికను తల్లిదండ్రులు ప్రశ్నించగా జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాధితురాలు ఆదివారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ జి. దశరథరామారావు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 35.230 టీఎంసీల నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 35.230 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 2,440, పిన్నేరుకాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగాలు ఊస్ట్



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి దేవుడు ఎరుగు. అప్పటికే వివిధ విభాగాల్లో చిరు ఉద్యోగులుగా ఉపాధి పొందుతున్న వేలాది మంది కొలువులు ఊడగొట్టి ఇంటికి పంపించింది. ఏడాది కాలంలో ఒక్క ఉద్యోగం కూడా కల్పించినట్లు రికార్డులు లేకపోగా, వేలాది ఉద్యోగాలు ఊస్ట్ చేసి రికార్డులు బద్దలు కొట్టింది. జిల్లాలో గత ప్రభుత్వంలో అనుమతులు పొంది గ్రౌండింగ్‌లో ఉన్న పరిశ్రమలు కూటమి పాలన రాకతో మధ్యంతరంగా నిలిచిపోయాయి. ఈ ఏడాదిలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఒక్క ఔత్సాహిక పారిశ్రామికవేత్త కూడా ముందుకు రాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

నేడు కలెక్టరేట్ ఎదుట 'యువత పోరు'

- కొత్త కొలువులకు దారేది!
- నిరుద్యోగ భృతికి మొండిచేయి
- ఏడాది కాలంలో ఒక్క పరిశ్రమ రాలేదు
- పరిశ్రమల ఏర్పాటుకు ఒక్క దరఖాస్తు రాకపోయే



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో 'నిరుద్యోగ భృతి' ఒకటి. ఇటీవల సీఎం చంద్రబాబు, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ నిరుద్యోగులకు తామిచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు ఇచ్చేశామని, ఎవరైనా దీనిపై ప్రశ్నిస్తే.. వారి నాలిక మందం అనుకోవాలంటూ చేసిన ప్రసంగం చూస్తే.. నిరుద్యోగ భృతికి మంగళం పలికినట్లే అని స్పష్టమవుతోంది. జిల్లాలో ఏడాది కాలంగా ఒక్క పరిశ్రమ గ్రౌండింగ్ కాలేదు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ఒక్క దరఖాస్తు రాలేదు. అందరికీ ఉద్యోగాలిచ్చేశామని కూటమి పాలకులు చెప్పడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు యువతీయువకులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 5 లక్షల మంది నిరుద్యోగులు

ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తున్నట్లు ప్రకటించారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులందరికి ఉద్యోగాల కల్పిస్తామని, లేదంటే ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికి నిరుద్యోగ భృతి ఊసే ఎత్తలేదు. డిగ్రీ, ఇంజినీరింగ్, ఇంటర్మీడియట్, పదో తరగతితోపాటు ఐటీఐ అర్హతలు కలిగిన నిరుద్యోగులు జిల్లాలో సుమారు 5 లక్ష మందికిపైగా ఉంటారని అంచనా. నెలకు రూ.3 వేలు లెక్కన రూ.150 కోట్లు భృతిగా చెల్లించాల్సి ఉంది. సంవత్సరానికి రూ.1800 కోట్లు నిరుద్యోగులకు బకాయి పడింది. తాజాగా కూటమి పాలకులు చెప్పడాన్ని బట్టి చూస్తే.. ఇక నిరుద్యోగ భృతి ఊసే లేదని స్పష్టమవుతోంది.

ఒక్క నోటిఫికేషన్ లేదు..

ఏడాది కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక్క నోటిఫికేషన్ విడుదల కాలేదు. మెగా డీఎస్సీ అంటూ ప్రమాణ స్వీకారం రోజే తొలి సంతకం చేసినా ఏడాది తర్వాత దగా డీఎస్సీ చేస్తూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 673 ఉద్యోగాలకే నోటిఫికేషన్ విడుదల చేశారు. వేలల్లో ఉపాధ్యాయుల కొలువులు వస్తాయని ఆశించిన నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. ఈ పోస్టుల కోసం సుమారు 28,772 మంది నిరుద్యోగులు పోటీపడుతుండడం గమనార్హం. పోలీస్ కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ ఉంటుందని పోలీస్ ఉన్నతాధికారులు చెప్పడంతో ఆ కొలువుల కోసం యువత శిక్షణ తీసుకునేందుకు రూ. వేలల్లో ఫీజులు కట్టాల్సి పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామం కుటుంబానికి ఆర్థిక భారం అయినప్పటికి ప్రభుత్వ కొలువులు కోసం అప్పులు చేసి కోచింగ్‌లు తీసుకుంటున్నారు. కోచింగ్‌లకు కట్టే ఫీజులతోపాటు ప్రైవేటు వసతిగృహాల్లో ఉండేందుకు నెలకు మరో రూ.6 వేల వరకు అదనపు ఖర్చును భరిస్తున్నారు. ఇటువంటి నిరుద్యోగులకు భృతి కల్పిస్తే కొంత వెసులుబాటు ఉండేది.

జిల్లాలో నిరుద్యోగ యువత : 5 లక్షల మందికిపైనే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కల్పించిన కొలువులు

సచివాలయాల్లో శాశ్వత ఉద్యోగులు	6,323
వలంటీర్లు	15,417
ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు	6,150
ప్రైవేట్ రంగాల్లో	8,600 కుపైగా

కూటమి తొలగించిన ఉద్యోగాలు

వలంటీర్లు	15,417 మంది
బెవరేజ్‌లో ఉద్యోగులు	594 మంది
ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు	876 మంది
ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు	759 మందిపైనే..
ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్లు	20 మంది
రేషన్ డీలర్లు	480 మందిపైనే..

గత ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలకే ఎసరు

కూటమి ప్రభుత్వంలో కొత్త ఉద్యోగాలు సంగతి దేవుడు ఎరుగు.. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలకే ఎసరు పెట్టింది. ఇప్పటికే వలంటీర్ల నుంచి మద్యం బేవరేజ్ ఉద్యోగులు, ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్లు, రేషన్ డీలర్లతోపాటు వివిధ శాఖల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉంటే అంగన్‌వాడీలు, ఆయాలు, కుకింగ్ ఏజెన్సీల సభ్యులను సైతం వేలల్లో తొలగించింది. ఇక వైఎస్సార్‌సీపీ మానసపుత్రికలు అయిన గ్రామ/వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, విలేజ్ లైబ్రరీల్లో నియమించిన వివిధ కేటగిరీ పోస్టులను కుదిస్తోంది. వీటన్నింటిని ఎక్కడికక్కడ విలీనం చేసి, పోస్టుల సంఖ్యను తగ్గించడంతోపాటు మిగులు ఉద్యోగులుగా గుర్తించి వేరే శాఖలకు బదిలీ చేసే ప్రయత్నం చేస్తోంది. దీని వల్ల వీరి సీనియారిటీని కోల్పోవాల్సిన పరిస్థితి అనివార్యమైంది.



మా నాన్న తప్పు చేయడు.. ఎవరైనా చేస్తే ఒప్పుకోడు

బూటకపు కేసుల నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తాడు

- సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేస్తున్నారు
- అక్రమ కేసుల్లో కాకాణి పేరు చెప్పమని పోలీసులు వేధిస్తున్నారు
- అన్నింటిని ఆ దేవుళ్లే చూస్తున్నారు.. వారే శిక్షిస్తారు
- 'సాక్షి'తో మాజీమంత్రి కాకాణి తనయ పూజిత



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'నేను గట్టిగా నమ్ముతున్నాను. మా నాన్న ఎలాంటి తప్పు చేయలేదని. చేయని తప్పులకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు. బెయిల్ రాకుండా రోజుకో కేసు తెరపైకి తెచ్చి వేధిస్తున్నారు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నాన్నను దగ్గరగా చూస్తున్నాను. ఆయన ఏ తప్పు చేయడు. తప్పు చేసిన వారు ఎవరైనా ఒప్పుకోడు. అలాంటి ఆయనపై అక్రమ కేసులు పెడుతున్నారు. అన్నింటిని ఆ భగవంతుడే చూస్తున్నాడు. నాన్నపై కుట్ర పన్ని తప్పులు చేసిన వారు, చేయిస్తున్న వారిని భగవంతుడే శిక్షిస్తాడు. నాన్న కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని నేను నమ్ముతున్నాను' వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తనయ కాకాణి పూజితతో 'సాక్షి' ఇంటర్వ్యూ.

ప్రశ్న : మీ నాన్న అరెస్ట్ తర్వాత మీ కుటుంబ సభ్యుల పరిస్థితి ఏమిటి?

జవాబు : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిత్యం ప్రశ్నిస్తున్నారని మానాన్నపై అక్రమ కేసులు బనాయించి రిమాండ్‌లో ఉంచారు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నాన్నను వదిలి ఉండలేదు. ఎప్పుడు ఆయనతోనే ఉండేవాళ్లం. నాకు వివాహం అయి తొమ్మిదేళ్లు. అప్పుడే నా ఇద్దరు బిడ్డలు నా వద్దే ఉండాలని చెప్పి చేశారు. నాన్నను చూడకుంటా ఒక్క రోజు కూడా ఉండలేదు. అలాంటిది మూడు నెలలుగా నాన్నకు దూరంగా ఉంటే ఎలా ఉంటుంది?. 80 ఏళ్ల మా నాన్నమ్మ నా బిడ్డ ఏం తప్పు చేశాడని జైల్లో పెట్టారని ప్రశ్నిస్తుంటే ఆమెను ఓదార్చలేకపోతున్నాం. మా పిల్లలు తాతయ్య ఎక్కడని రోజూ ఏడుస్తున్నారు. పిల్లలు వాళ్ల తాతయ్యను వదిలి ఉండలేదు. మా నాన్న మనస్తత్వం తెలిసిన నేను గట్టిగా నమ్ముతున్నాను. ఆయన తప్పు చేయడు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా జంకడు. ఆయన్ను ఒక రాజులా చూశాను. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో ఆయన్ను చూడలేకే ములాఖత్‌కు వెళ్లడం లేదు.

ప్ర: కాకాణిని జైల్లో పెట్టడంతో పార్టీ కేడర్ పరిస్థితి ఏమిటి?

జ: మూడు నెలలుగా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు మా నాన్న దూరంగా ఉన్నారు. అయినా పార్టీ కేడర్ ఏమీ భయపడడం లేదు. నా తండ్రి అందుబాటులో లేకపోయినా.. ఆయన బిడ్డగా నేను పార్టీ కేడర్‌కు అండగా నిలబడి ధైర్యం చెబుతున్నాను. అందరికి మంచి చేసిన మా నాన్నను జైల్లో పెట్టడంతో పార్టీ కేడర్ మొత్తం కసితో ఉన్నారు. వారే ముందుకు వచ్చి మాకే ధైర్యం చెబుతున్నారంటే ఆయన వారిపట్ల ఎంత నిబద్ధతగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

ప్ర: పార్టీ కేడర్‌ను వేధిస్తున్నారన్న సమాచారం ఎంత వరకు నిజం?

జ: కూటమి ప్రభుత్వ పెద్దలు ఆదేశాలతో పోలీసులు మా నాన్న గోవర్ధన్‌రెడ్డిపై ఇప్పటికే చాలా అక్రమ కేసులు పెట్టారు. రోజుకో కేసు పెడుతున్నారు. ఆధారాలు లేని ఆ కేసుల్లో నాన్న పేరు చెప్పాలని పార్టీ కేడర్‌ను పోలీసులు తీసుకెళ్లి చిత్రహింసలు పెడుతున్నారు. వాళ్ల టార్చర్ భరించలేకపోతున్నట్లు కొందరు నాకు ఫోన్ చేసి అమ్మా మమ్మల్ని పోలీసులు ఇబ్బంది పెట్టి సంతకాలు తీసుకుంటున్నారు అని చెబుతుంటే బాధగా అనిపిస్తుంది. నాన్న ఒక్కడిని ఇబ్బంది పెట్టడం కోసం ఇంత మందిని హింసించడం చూస్తే నా మనస్సు చలిస్తుంది. నాన్న వెంట నడిచిన నేతలందరిని కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారు.

ప్ర: భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?

జ: మా కుటుంబం విలువలతో కూడిన రాజకీయం చేసింది. మా తాతయ్యకు ఇప్పటికి మంచి పేరు ఉంది. మా తాత విలువలకు వారసుడిగా రాజకీయ చేస్తున్నారే కానీ.. ఏనాడు తెలియక కూడా తప్పు చేయలేదు. జెడ్పీ చైర్మన్‌గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఎవరికి అన్యాయం చేయలేదు. తప్పు చేసిన వారిని రాజకీయ కోణంలోనే ఆ తప్పులను ఎత్తి చూపి విమర్శలు చేశారనే కానీ, అధికారంలో ఉన్నప్పుడు వ్యక్తిగత కక్ష తీర్చుకునే ప్రయత్నం చేయలేదు. మా నాన్న ఏ తప్పు చేయలేదు కాబట్టి కచ్చితంగా కడిగిన ముత్యంలా బయటకు వస్తాడు. అంత వరకు మా నియోజకవర్గంలోని మా పార్టీ కార్యకర్తలకు నేను అండగా ఉంటానని చెప్పాను.

మామిడి మార్కెట్‌లో ట్రాఫికర్



తారు రోడ్డు మీదనే ట్రేలు, వాహనాలు

ఉలవపాడు: మండల కేంద్రం ఉలవపాడులోని పండు మామిడి కాయల మార్కెట్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ఉలవపాడు ఉత్తర బైపాస్ జంక్షన్ వద్ద ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ట్రేల్లో మామిడి కాయలను పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటి కోసం వచ్చిన ఆటోలు, ట్రాక్టర్లను రోడ్డుపైనే నిలిపివేయడంతో హైవే నుంచి ఉలవపాడు లోపలికి వచ్చే వాహనాలు, బయటకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాలకు వెళ్లే వారు అయితే దాదాపు 15 నిమిషాలపైనే ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. మామిడి కాయల వాహనాలు, కాయలను దించడానికి వచ్చిన వాహనాలు, కొనుగోలుదారుల వాహనాలతో ఆ ప్రాంతమంతా కిటకిటాలాడుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. బస్సులు, లారీలు వంటి పెద్ద వాహనాలు రావాలంటే చాలా ఇబ్బందిగా మారింది. వాహనచోదకులను నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నా.. పోలీసు శాఖ కనీసం పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్యలు నియంత్రించడానికి, గంపలు, ట్రేలు రోడ్డు మార్జిన్‌కు అవతల ఉండేలా చర్యలు తీసుకునే విధంగా పోలీసు కానిస్టేబుల్‌ని నియమించేవారు. కానీ ఈ ఏడాది సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు ఏర్పడుతున్నాయి.



మామిడి మార్కెట్ వద్ద ట్రాఫిక్ కష్టాలు

కాకాణిపై రోజుకో కేసు నమోదు



మాట్లాడుతున్న చంద్రశేఖరరెడ్డి, చిత్రంలో అనిల్, తలశిల రఘురాం, మేరిగ మురళీధర్, కిలివేటి సంజీవయ్య తదితరులు

- 3న నెల్లూరుకు మాజీ సీఎం జగన్ రాక
- జిల్లా జైల్లో కాకాణితో ములాఖత్
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూలై 3న నెల్లూరు సెంట్రల్ జైల్‌లో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అవుతారని నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మాజీ సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కాకాణి కుమార్తె కాకాణి పూజిత తదితరులతో కలిసి ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం మాట్లాడారు. కాకాణిపై ఒకదాని తరువాత మరొకటి అక్రమ కేసులు నమోదు చేసి నిర్బంధించడం దుర్మార్గమన్నారు. కాకాణిపై అక్రమ కేసుల విషయాలను వైఎస్ జగన్ ఎప్పటికప్పుడు విషయాలు తెలుసుకుంటూ ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఫోన్లలో పరామర్శిస్తున్నారన్నారు. ఈ క్రమంలో జూలై 3న కేంద్ర కారాగారంలో ములాఖత్ అయిన అనంతరం స్వయంగా కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలపై పెట్టిన అక్రమ కేసులకు తగిన మూల్యం చెల్లించుకునే రోజు దగ్గరలోనే ఉందన్నారు.

- మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దాష్టీకాలకు కాకాణి అక్రమ అరెస్టులే నిదర్శనమన్నారు. తప్పుడు కేసులు పెట్టి పోలీసులు పీటీ వారెంట్‌లు తెచ్చుకుని ఆయన్ను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇది పూర్తిగా రాజకీయ వేధింపుల్లో భాగమని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగించే చర్య అన్నారు. జగనన్న పర్యటనకు ముందే కాకాణిని ఇతర చోట్లకు తరలించే కుట్ర కొనసాగుతుందన్నారు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా జూలై 3న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరుకు వచ్చి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శిస్తారని తెలిపారు. జగనన్న ఈ నిర్ణయం తమ పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు ధైర్యాన్ని కలిగిస్తుందన్నారు.
- కాకాణి పూజిత మాట్లాడుతూ తన తండ్రి గోవర్ధన్‌రెడ్డికి మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ క్యాడర్ మొత్తం అండగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వచ్చి తన తండ్రిని పరామర్శిస్తుండడం తమకెంతో ధైర్యంగా ఉందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

క్లుప్తంగా

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



ఆత్మకూరు: రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఆత్మకూరు మేజర్ చెరువు ఆయకట్టు సాగునీటి సంఘ అధ్యక్షుడు మాదాల మస్తాన్‌నాయుడు (62) నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వివరాలు.. నెల్లూరుపాళెం నుంచి సమీపంలోని లారీ కాటా వద్దకు బైక్‌పై రెండు రోజుల క్రితం వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటో ఢీకొంది. రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమైన ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందారని ఎస్సై జిలానీ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ..

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ ఆదివారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరపాలక సంస్థలో అవుట్‌సోర్సింగ్ విధానంలో స్వీపర్‌గా పనిచేస్తున్న వెంగళరావునగర్‌కు చెందిన వనజమ్మ (52) ఆర్థిక ఇబ్బందులను తాళలేక తన ఇంట్లో గడ్డి మందును శనివారం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు ఆమెను జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు.. హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరికుంటపాడులో చోరీ



హుండీని పరిశీలిస్తున్న స్థానికులు

వరికుంటపాడు: వరికుంటపాడులో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రామాలయం, శివాలయం నాగర్పమ్మ ఆలయంలోని హుండీలు.. చర్చిలోని కానుక పెట్టెను ఎత్తుకెళ్లారు. గ్రామ శివార్లలో వీటిని పడేసి నగదును దోచుకెళ్లారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వివరాలను సేకరించింది.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



సంగం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన సంగం – కొరిమెర్ల రహదారిపై ఆదిపరాశక్తి ఆశ్రమ సమీపంలో గల మలుపు వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గుంతలో బైక్ పడటంతో వెంకట్రావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని 108లో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎమ్టీఎస్ బదిలీలకు కౌన్సెలింగ్



హాజరైన ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్): జిల్లాలో 1998, 2008 డీఎస్సీలకు సంబంధించి మినిమమ్ టైమ్ స్కేల్ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని 243 మంది ఎమ్టీఎస్ ఉపాధ్యాయులకు 900కుపైగా ఖాళీలను చూపారు. నెల్లూరు సమీపంలోని 11 మండలాల్లో ఒక్క ఖాళీ పోస్టునూ చూపకపోవడంతో ఇతర మండలాల్లో ఎంపిక చేసుకున్నారు. వీరికి బదిలీ ఉత్తర్వులను డీఈఓ బాలాజీరావు జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించినందుకు దాడి

నెల్లూరు(క్రైమ్): బావమరిదిని ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించిన బావపై నిందితులు దాడి చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వైఎస్సార్‌నగర్‌లో నివాసం ఉంటున్న బంధువు లక్ష్మమ్మ ఇటీవల ఆపరేషన్ చేయించుకోవడంతో ఆమెను చూసేందుకు గానూ అక్కడికి చంద్రమౌళీనగర్‌కు చెందిన తిరుపాల్ శనివారం సాయంత్రం వెళ్లారు. ఈ క్రమంలో తన బావమరిది మునెయ్యపై అదే ప్రాంతానికి చెందిన హేమంత్ మరో ఇద్దరు దాడి చేస్తుండగా, అడ్డుకున్నారు. ఎందుకు దాడి చేస్తున్నారని ప్రశ్నించిన తిరుపాల్‌పై రోకలి బండతో హేమంత్ దాడి చేశారు. స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన తిరుపాల్ జీజీహెచ్‌లో చికిత్స పొంది వేదాయపాళెం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టి తల్లికి పెద్ద కష్టం

- బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న బాలిక
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- దాతల కోసం ఎదురుచూపులు

సోమశిల: చదువు.. ఆటపాటలతో స్నేహితులతో సరదాగా గడపాల్సిన చిట్టి తల్లికి పెద్ద కష్టమొచ్చింది. బ్రెయిన్ ట్యూమర్‌తో ఏడాదిగా ఇంటికే పరిమితమవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. వైద్యసేవల కోసం ఉన్న మొత్తాన్ని వెచ్చించినా, ప్రయోజనం కరువైంది. చివరికి కుమార్తె ప్రాణాలు కాపాడేందుకు నానా అవస్థలు పడుతూ దాతల సాయం కోసం నిరీక్షిస్తున్నారు.

ఉన్నదంతా వైద్య ఖర్చులకు

అనంతసాగరం మండల పరిధిలోని సోమశిలకు చెందిన రాచూరి వెంకటయ్య, కృష్ణమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూతురు శ్రీవిద్యకు 14 ఏళ్లు. పిల్లల చదువు చూసుకుంటూ మేకలను మేపుకొంటారు. ఎనిమిదో తరగతి వరకు చదివిన బాలికకు ఏడాది క్రితం ఆరోగ్య సమస్య వచ్చింది. ఆ సమయంలో పరీక్షలు చేయించగా, బ్రెయిన్ ట్యూమర్ అనే తేలింది.



బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న శ్రీవిద్య

అప్పట్నుంచి పలు ఆస్పత్రులను ఆశ్రయించారు. మేకలను విక్రయించగా, వచ్చిన మొత్తాన్ని కుమార్తె వైద్య ఖర్చులకు వెచ్చించారు. ఆపరేషన్ నిమిత్తం చెన్నైలోని ఓ హాస్పిటల్లో రూ.నాలుగు లక్షలను వెచ్చించినా, ప్రయోజనం లభించలేదు. ప్రస్తుతం కుటుంబీకులను సైతం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. తాజాగా మరోసారి చెన్నైలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఇంకా ఖర్చవుతుందని చెప్పడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. తమది పేద కుటుంబమని, దాతలు సహకరిస్తే కుమార్తె ప్రాణాలు దక్కుతాయని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఆపన్నహస్తం అందించాలనుకునే వారు 89859 63283 నంబర్‌ను సంప్రదించాలని వేడుకుంటున్నారు.

ప్రతిభ పురస్కారాల అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 68 మంది నాయీబ్రాహ్మణ విద్యార్థులకు నగదు పారితోషికం, సర్టిఫికెట్లను నరుకూరు రోడ్డులోని మద్దులూరి వీరరాఘవయ్య కల్యాణ మండపంలో ఆదివారం అందజేశారు. నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ, జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రిటైర్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీంద్రనాథ్, పారిశ్రామికవేత్త దువ్వూరు కిశోర్‌బాబు, కాణిపాక విఘ్నేశ్వరాలయ ఈఓ కూరపాటి కిశోర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ హెచ్ఓడీ సుజాత హాజరయ్యారు. నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కనక, జర్నలిస్ట్ అన్నవరపు బ్రహ్మ, సీఆర్డీఏ జూనియర్ ప్లానింగ్ అధికారి ఉమామహేశ్వరరావు, అధ్యక్షుడు వేలూరు రంగారావు, కోశాధికారి ప్రభాకర్‌రావు, సుబ్బారావు, హజరత్, కేశవులు, వెంకటేశ్వరరావు, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ విజేతగా ఫ్రెండ్స్ లెవన్



తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరులో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా ఫ్రెండ్స్ లెవన్ జట్టు నిలిచింది. ఈ నెల రెండు నుంచి నిర్వహించిన పోటీలకు 50 జట్లు హాజరయ్యాయి. విజేత ఫ్రెండ్స్ లెవన్ జట్టుకు రూ.50 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన విద్యా ఫౌండేషన్, ఏపీ జెన్‌కో, బీఎస్సీ జట్లకు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలను ఇచ్చారు. టీడీపీ నేత బొమ్మి సురేంద్ర, విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాము, నేతలు బొమ్మి సుమన్, నరాల రాంబాబు, మన్నెం జితేంద్ర, వెంకటేశ్వర్లు, నరాల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

నీరాజనం సంచిక ఆవిష్కరణ

కావలి (జలదంకి): బామా వ్యవస్థాపక కార్యదర్శి లేబాకుల సుధాకర్‌రెడ్డి సంస్మరణ సంచిక నీరాజనాన్ని పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని రిటైర్డ్ ప్రిన్సిపల్ కాళిదాసు పురుషోత్తం, బామా అధ్యక్షుడు బెజవాడ రవికుమార్ చేతుల మీదుగా నిర్వహించారు. పట్టణంలో సాంస్కృతిక రంగానికి లేబాకుల సుధాకర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. మనోహర్‌బాబు, రామచంద్ర, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అజిత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 158 మంది సర్టిఫికెట్లను ప్రిన్సిపల్ రామారావు నేతృత్వంలో పరిశీలించారు. 32001 నుంచి 50 వేల ర్యాంకుల వరకు ఉన్న విద్యార్థుల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించనున్నారు.

పేకాట స్థావరంపై దాడి

నెల్లూరు సిటీ: పేకాట స్థావరంపై నెల్లూరు రూరల్ పోలీసులు దాడి జరిపి తొమ్మిది మందిని ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఆమంచర్లలోని అప్పయ్య కండ్రిగలో గల పొలంలో గుట్టుచప్పుడు కాకుండా కొందరు పేకాటాడున్నారనే సమాచారం అందింది. దీంతో స్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.36750 నగదు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

జేఎల్ఎం గ్రేడ్ – 2లకు ఉద్యోగోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న నరసింగరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జేఎల్ఎం గ్రేడ్ – 2లను విద్యుత్ సంస్థల్లో విలీనం చేసి వారికి అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ఉద్యోగోన్నతులను కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు డిమాండ్ చేశారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో జేఎల్ఎం గ్రేడ్ – 2 రాష్ట్ర సదస్సును యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వైద్య సదుపాయాలు, కారుణ్య నియామకాలు, ఆర్జిత సెలవులు తదితరాలను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలోని ఓ డిస్కమ్‌లో అమలయ్యే సదుపాయాలు మరోచోట అమలుకు నోచుకోవడంలేదని చెప్పారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అల్తాఫ్, యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ పెంచలప్రసాద్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుమన్, జాకీర్ హుస్సేన్, హజరత్తయ్య, నేతలు నాగసుబ్బయ్య, వీరాంజనేయులు, ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండగ నిర్వహణ

- మంత్రి నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగను ఈ ఏడాది అంగరంగవైభవంగా నిర్వహించనున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. జూలై ఆరు నుంచి 11 వరకు నిర్వహించనున్న రొట్టెల పండగకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో దర్గాలో ఆదివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ, విదేశాల నుంచి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. తాగునీటికి సమస్య తలెత్తకుండా చూడటంతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఘాట్లను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు పంపింగ్ మెషీన్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. వివిధ శాఖలకు కేటాయించిన పనులను ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఘాట్లను పరిశీలించారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ నందన్ డీఎస్పీ సింధుప్రియ, టీడీపీ నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్లలో అనస్థీషియన్ల పాత్ర కీలకం

నెల్లూరు(అర్బన్): రోగులకు నిర్వహించే ఆపరేషన్ల విజయవంతంలో అనస్థీషియన్ డాక్టర్లు కీలకపాత్ర పోషిస్తారని ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి పేర్కొన్నారు. పీజీ వైద్యుల కోసం ఏపీ స్టేట్ పీజీ జోనల్ సీఎంఈ ప్రోగ్రామ్‌ను దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమావేశ మందిరంలో అనస్థీషియా విభాగ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడారు. ఆపరేషన్ సమయంలో తగు మోతాదులో మత్తివ్వడం.. దాని నుంచి రోగి సాధారణ స్థితికొచ్చేంత వరకు దగ్గరుండి పర్యవేక్షించడం.. నొప్పిని తగ్గించడం తదితరాలన్నీ మత్తు డాక్టర్ల ఆధ్వర్యంలోనే జరుగుతాయని చెప్పారు. రోగులకు మరింత సేవలందించేందుకు పీజీ వైద్యులు ఆధునిక వైద్య విధానాలను పూర్తిగా నేర్చుకోవాలని కోరారు. అనంతరం వివిధ అంశాలపై పలువురు అవగాహన కల్పించారు. సర్వజన ఆస్పత్రి అనస్థీషియా హెచ్ఓడీ శ్రీనివాసరావు, అపోలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అనస్థీషియా విభాగ హెచ్ఓడీ రాజమోహన్‌రెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గోవిందు, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, మత్తు డాక్టర్లు సురేష్, శాంతిశ్రీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

ఊరెళ్లొచ్చేలోపు ఇల్లు గుల్ల

- 13 సవర్ల బంగారం చోరీ


అల్లూరు: ఊరెళ్లొచ్చేలోపు ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని అంజినాయుడు కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు.. కాలనీలో నివాసం ఉంటున్న కోడూరు ఉమాదేవి తన తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చూసేందుకు కుటుంబసభ్యులతో కలిసి ఊరికి గురువారం వెళ్లారు. ఇంటికి ఆదివారం రాగా, తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలికెళ్లి చూడగా, 13 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో అల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చిందరవందరగా వస్తువులు

పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10



ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



కావలి (జలదంకి): బాడీ బిల్డింగ్ పోటీలను పట్టణంలోని బృందావనం కల్యాణ మండపంలో నెల్లూరు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మిస్టర్ సింహపురి స్టీల్‌మెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌ను కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ప్రారంభించారు. 150 మందికిపైగా యువకులు హాజరుకాగా, పది విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఒక్కో విభాగంలో ఐదు బహుమతులను అందజేశారు. ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ స్వామి రమేష్‌కుమార్, ఏపీ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసరాజు, జగన్, ఉత్తరప్రదేశ్ ఆసియన్ గోల్డ్ మెడలిస్ట్ సంజన, అర్జున అవార్డు గ్రహీత భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

తూ.కొ. అధికారుల దాడులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని పొదలకూరు రోడ్డు, డైకస్ రోడ్డు, గాంధీనగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చేపలను విక్రయిస్తున్న వ్యాపారుల కాటాలపై దాడులను తూనికలు, కొలతల శాఖాధికారులు ఆదివారం నిర్వహించారు. వినియోగదారులు కొనుగోలు చేసిన చేపలను అధికారులు తమ కాటాలతో నికర తూకం సరి చూశారు. తేడాలను గుర్తించి వారిపై మూడు కేసులను నమోదు చేసి కాటాలను జప్తు చేశారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ మాట్లాడారు. తూకాల్లో మోసం చేస్తున్నారంటూ స్పందన చారిటబుల్ ట్రస్ట్, మరికొందరు తమకు ఫిర్యాదు చేశారని, దీంతో దాడులు జరిపామని వివరించారు. తూకాల్లో మోసం చేయొద్దని సూచించారు.

పాతకక్షలతో గొడవ

విడవలూరు: పాతకక్షలను మనస్సులో పెట్టుకొని, తిరునాళ్లలో గొడవకు పాల్పడిన ఘటన రామతీర్థంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రామతీర్థంలోని అరుంధతీయవాడలో నివాసం ఉంటున్న మర్లపాటి లక్ష్మయ్య, ఆయన కుమారుడు తిరుమల, అల్లుడు ఏడుకొండలుకు.. అదే గ్రామానికి చెందిన చెరుకూరు ధనుంజయ, ఆయన కుమారులు గోపీ, వెంకటేష్‌తో మనస్పర్థలున్నాయి. ఈ తరుణంలో తిరునాళ్లలో మర్లపాటి తిరుమల, చెరుకూరు గోపీ తారసపడ్డారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న గోపీ ఆయన్ను దుర్భాషలాడుతూ గొడవకు దిగారు. అక్కడున్న వారు వచ్చి సర్దిచెప్పడంతో ఇళ్లకెళ్లారు. కొద్దిసేపటి అనంతరం గోపీ, ఆయన తండ్రి ధనుంజయ, సోదరుడు వెంకటేష్‌ను తీసుకెళ్లి తిరుమల ఇంటి వద్ద గొడవకు దిగారు. దీనిపై ఏడుకొండలు ప్రశ్నించగా, ఆయనపై దాడికి పాల్పడ్డారు. పక్కనే ఉన్న లక్ష్మయ్యపై కర్రతో దాడి చేయడంతో తలకు గాయమైంది. దీనిపై ఇరు కుటుంబాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. గాయపడిన లక్ష్మయ్య నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఆస్పత్రి నుంచి విడవలూరు పోలీసులకు సమాచారం అందింది.

గోడ ధ్వంసంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి గోడను పగలగొట్టిన వారిపై కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రవీంద్రరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న నరసింహారెడ్డికి తన తల్లిదండ్రుల ద్వారా రేకులిల్లు వచ్చింది. ఆయన ఇంట్లోకి బంధువు రామసుబ్బారెడ్డి మరో ఇద్దరు అక్రమంగా శుక్రవారం ప్రవేశించి గోడను పగలగొట్టారు. ప్రశ్నించిన నరసింహారెడ్డిని చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీతో యువతలో దేశభక్తి

కోట: ఎన్‌సీసీలో చేరడం ద్వారా యువతలో దేశభక్తి పెంపొందుతుందని క్యాంప్ కమాండెంట్ గణేష్ పేర్కొన్నారు. విద్యానగర్‌లోని ఎన్బీకేఆర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ నావల్ యూనిట్ వార్షిక శిబిరంలో భాగంగా క్యాడెట్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నావల్ క్విజ్‌ను నిర్వహించి సముద్ర నావిగేషన్‌పై అవగాహన కల్పించారు. రైఫిల్ షూటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్లు మల్లికార్జున్ రెడ్డి, పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగరతీరంలో సందడి



జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కోడూరు బీచ్ సందర్శకులతో ఆదివారం సందడిగా మారింది. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన వారు సముద్రస్నానాలు చేస్తూ కోలాహలంగా గడిపారు. ఉదయం పదింటికి ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం ఆరు వరకు కొనసాగాయి. – తోటపల్లిగూడూరు